క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చంద్రగిరి: మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో ఒక్కో విభాగంలో ముగ్గురు విద్యార్థులు మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వారికి నిర్వాహకులతో పాటు ఎంఈఓ లలిత కుమారి బహుమతులను ప్రదానం చేశారు. త్వరలో జరగబోయే జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నారని, అక్కడ ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి వెళ్లాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీచ్ టూల్‌తో పని తీరు మెరుగు

పాకాల : ఉపాధ్యాయుల పనితీరును మెరుగు పరుచుకునేందుకు టీచ్‌టూల్ చాలా ఉపయోగపడుతుందని ఎంఈఓ బాబ్జీ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నేడు వృద్ధాశ్రమానికి భూమిపూజ

భాకరాపేట : తన తండ్రి స్వర్గీయ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ వలసారెడ్డి శిద్ధరామిరెడ్డి ఆశయం మేరకు వృద్ధాశ్రమం నిర్మిస్తున్నట్లు హరే రామ హరే కృష్ణ, నమో వేంకటేశాయ నిలయం నిర్మాణ దాత వలసారెడ్డి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డ పంచాయతీ శ్రీ కొల్లాపు రమ్మ ఆలయం దగ్గర రూ.6 కోట్లతో 100 గదులతో కూడిన వృద్ధాశ్రమానికి ఆదివారం ఉదయం భూమిపూజ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నాని, సెట్విన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ బిజియ్ అగర్వాల్, రాంకీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సీఈఓ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, తిరుపతి ఇస్కాన్ సంస్థ ప్రతినిధి రేవతిరమణదాస్ హాజరవుతారన్నారు.

28న రాష్ట్ర భూసదస్సు

తిరుపతి కల్చరల్: విజయవాడలో ఈనెల 28న నిర్వహిస్తున్న భూ సదస్సుకు బాధితులంతా తరలి రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం సీపీఐ కార్యాలయం వద్ద భూ సదస్సు పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గత భూదందాలు, భూసమస్యలు పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ సదస్సు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు పాల్గొన్నారు.

నేడు బీపీ మండల్ జయంతి

తిరుపతి కల్చరల్: బీసీ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో డీబీఆర్ రోడ్డులో ఉన్న బీపీ మండల్ విగ్రహం వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు 106వ జయంతి వేడుకలకు బీసీ సంఘనేతలు, విద్యార్థి యువజన సంఘాలంతా పాల్గొని జయప్రదం చేయాలని బీసీ సంఘర్షణ సమితి గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య, అక్కినపల్లి లక్ష్మయ్య పిలుపునిచ్చారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో బీసీ సంఘర్షణ సమితి నేతలు పాల్గొన్నారు.

ఏపీఆర్‌ఓగా గోపి



తిరుపతి అర్బన్: తిరుపతి సమాచార శాఖ, సహాయ పౌర సంబంధాల అధికారిగా గోపిని నియమించారు. ఆ మేరకు ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా సీనియర్ సహాయకులుగా పని చేస్తున్న ఆయనకు సహాయ పౌర సంబంధాల అధికారిగా పదోన్నతి కల్పిస్తూ తిరుపతి కార్యాలయంలో ఖాళీగా ఉన్న స్థానంలో ఏపీఆర్‌ఓగా పోస్టింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందిని ఆయనను అభినందించారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



బంగారు తిరుచ్చిపై భక్తులను అనుగ్రహిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సర్వాలంకార శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెక్యూరిటీ పెంచాలి



ఏదైనా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న రోగిని చూసి కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతారు. బతికించుకోవాలన్న ఆత్రుతతో ఆవేశంగా ఉంటారు. ఈ క్రమంలో వైద్య సేవలో లోపం ఉందేమోనని అపోహపడి వైద్యుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తుంటారు. ఇది సరైన పద్ధతి కాదు. వైద్యుల పట్ల దాడులను అరికట్టాలంటే అత్యవసర విభాగంలో పోలీస్ ఫోర్స్, సెక్యూరిటీ సామర్థ్యాన్ని పెంచాలి. ప్రభుత్వాస్పత్రుల్లో అసాంఘిక శక్తులు చొరబడకుండా పటిష్టమైన భద్రత కల్పించాలి. – డాక్టర్ ఆర్.శిరీష, నగర మేయర్ తిరుపతి

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి..



మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలంటే ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. అలాగే సెక్యూరిటీని పెంచి మహిళా ఉద్యోగులకు ధైర్యం కల్పించాలి. రాత్రి సమయంలో పోలీసులు ఆస్పత్రిని గంటగంటకు సందర్శించే విధంగా చూడాలి. అప్పుడే ఆకతాయిలకు కూడా భయం ఉంటుంది. ఇతరులు ఆస్పత్రులోకి ప్రవేశించకుండా గట్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి.
– మురళీకృష్ణ, పీహెచ్‌సీ డాక్టర్, పాకాల

యువత.. మారాలి మీ నడత

- సమాజం తలెత్తుకునేలా యువత నడుచుకోవాలి
- మహిళలపై హత్యాచారాలు భావితరానికే పెనుముప్పు
- మత్తు పదార్థాలను పాలకులు కట్టడి చేయాలి
- పౌర చైతన్య వేదిక సదస్సులో వక్తల పిలుపు



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు

తిరుపతి సిటీ: సమాజం తలెత్తుకుని యువత నడుచుకుంటే అమానవీయ సంఘటనలకు చోటు ఉండదని ప్రాచ్య పరిశోధనా సంస్థ సంచాలకులు ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో తిరుపతి పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో మార్పు రావాలంటే యువతలో చైతన్యం రావాలన్నారు. కోల్‌కతా ఘటన బాధ్యులను గుర్తించి కఠిన శిక్షలు విధించాలన్నారు. సదస్సులో అధ్యాపకులు దయాకర్, చక్రవర్తి రాఘవన్, సాకం నాగరాజు, పౌర చైతన్య వేదిక నాయకులు, సీనియర్ జర్నలిస్ట్ రాఘవశర్మ, నగరంలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజం స్పందించాలి..



సమాజంలో జరుగుతున్న అమానవీయ సంఘటనలపై సమాజం స్పందించాలి. ఒకరిద్దరిలో మార్పు వస్తే సరిపోదు. మన ఇంటి ఆడబిడ్డలాగే పరాయి మహిళలను గౌరవిస్తే కోల్‌కతాలాంటి సంఘటనలు జరగవు. మహిళల దుస్తుల్లో కాదు చూసే చూపులలోనే తేడా ఉంటోంది.
– సాయికీర్తన, ఇంజినీరింగ్ విద్యార్థిని, తిరుపతి

మత్తుపదార్థాలను నిషేధించాలి



సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులకు ప్రధాన కారణం మద్యం, మత్తు పదార్థాల వినియోగమే. యువత మత్తుకు అలవాటు పడి అందులోంచి బయటపడలేక జీవితాలను నాశనం చేసుకుంటోంది. పాలకులలో చలనం లేదు. ఏదైనా సంఘటన జరిగేతే ఆ క్షణం స్పందించి మరిచిపోతున్నాం.
– తన్విన్ ఆఫ్నాన్, బీటెక్ విద్యార్థిని, తిరుపతి

సమన్వయంతో పనిచేయాలి



మహిళలపై జరిగే మాన భంగాలు, అత్యాచారాలు, హత్యలను అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వం, సమాజం సమన్వయంతో పనిచేయాలి. ఒక్క రోజులో సమాజాన్ని మార్చాలంటే అసంభవం. యువతలో పెద్దఎత్తున చైతనం కల్పించాలి.
– వాకా ప్రసాద్, పౌర చైతన్య వేదిక, అధ్యక్షులు, తిరుపతి

నానో టెక్నాలజీపై జాతీయ సదస్సు


సదస్సుకు హాజరైన అతిథులకు జ్ఞాపికలను అందజేస్తున్న ప్రిన్సిపల్

తిరుపతి సిటీ: స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో ఫిజిక్స్ అండ్ కెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో శనివారం నానో మెటీరియల్స్ ఫర్ ఆప్టో ఎలక్ట్రానిక్ డిజైన్ అప్లికేషన్స్ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఐజర్ ఫిజిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్, ఎస్వీసీఈ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్ అంతా నానో టెక్నాలజీదేనని, విద్యార్థులు ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు. అనంతరం పలువురు వక్తలు నానోటెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సదస్సులో డాక్టర్ వినిగౌతమ్, డాక్టర్ కణగశేఖరన్, ఏకే ఆజాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యమా..! ఏమరపాటా..?


రోడ్డు పక్కన పడేసిన కాలం చెల్లిన మందులు, మాత్రలు

చంద్రగిరి: కాలం చెల్లిన మందులు, మాత్రలను రోడ్డు పక్కన పడేసిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల మేరకు.. చంద్రగిరి జాతీయ రహదారి నాగాలమ్మ ఆలయ వెనుక భాగంలో ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అందించే కాలం చెల్లిన మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పడేశారు. ఇక్కడ సమీపంలో వలస కార్మికులు నివాసం ఉంటున్నారు. అటుగా వెళ్లే వలస కార్మికులు పొరబాటున వాటిని తీసుకుని వాడితే ప్రాణాలకు ప్రమాదం వాట్టిలే అవకాశం ఉంది. రోడ్డు పక్కన పడేసిన మందులు, మాత్రలపై ప్రభుత్వ సరఫరా అని రాసి ఉంది. దీంతో వాటిని ప్రభుత్వ ఆస్పత్రి వారే ఇక్కడ పడేసి ఉంటారని స్థానికులు అంటున్నారు. ప్రమాదం జరగకముందే వాటిని జనావాసం లేని ప్రాంతంలో కాల్చి వేయాలని కోరుతున్నారు.

కృష్ణాష్టమి సంబరాలు


రాధాకృష్ణులు, గోపికల వేషధారణలో విద్యార్థులు

తిరుపతి కల్చరల్: స్థానిక ధనలక్ష్మీ నగర్‌లోని భాష్యం లిటిల్ చాంప్స్‌లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి సంబరాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆనాటి బృందావనాన్ని తలపించేలా భాష్యం విద్యాసంస్థల్లో కృష్ణాష్టమి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో పలు పాటలకు నృత్యాలు చేశారు. శ్రీకృష్ణుడి వేషంలో వచ్చిన విద్యార్థులతో ఉట్లోత్సవం నిర్వహించారు.

బీరు బాటిల్‌తో దాడి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం మల్లంగుంటకు చెందిన చంద్రబాబుపై రౌడీషీటర్ వెంకటేష్ బీర్ బాటిల్‌తో దాడి పాల్పడ్డాడు. వారం కిందట ఇరువురికి గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి మల్లంగుంటలోని చంద్రబాబు ఇంటికి వెళ్లిన వెంకటేష్ వాగ్వాదానికి దిగాడు. కోపంతో బీరు బాటిల్‌తో తలపై కొట్టాడు. పలుచోట్ల బాటిల్ పెంకులు చంద్రబాబుకు గుచ్చుకున్నాయి. బాధితుడు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడంతో వెంకటేష్ పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తిరుపతి రూరల్ ఎస్ఐ షెక్షావలి తెలిపారు.

విలువలు పాటిస్తే కలహాలు దూరం


మాట్లాడుతున్న రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం

తిరుపతి కల్చరల్: నేటి ఆధునిక సమాజంలో పెళ్లికి ముందే యువతకు కౌన్సెలింగ్ ఎంతో అవసరమని రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం సూచించారు. శనివారం రాస్ కుటుంబ సలహా కేంద్రంలో ఆధ్వర్యంలో రాస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.నాగరాజు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం రాస్ పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పెళ్లికి ముందే శారీరక, మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. దిశా పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ గిరిజ, ప్రముఖ న్యాయవాది సరళ మాట్లాడుతూ యువత భారతీయ సంప్రదాయాలు, విలువలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త రంగనాథం, ఐసీడీఎస్ సీడీపీఓ జి.సుధారాణి ప్రత్యేక విద్యా కళాశాల ప్రిన్సిపల్ వి.నందిని, రోటరీ క్లబ్ సభ్యుడు అంకమనాయుడు, రాస్ కుటుంబ సలహా కేంద్రం కౌన్సిలర్లు బాలాజీ, కవిత ప్రసంగించారు.

ఏసీబీ ఏఎస్పీగా విమలకుమారి



తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లా ఏసీబీ ఏఎస్పీగా శనివారం విమల కుమారి బాధ్యతలు స్వీకరించారు. ఈమె తిరుపతిలో క్రైమ్ ఏఎస్పీగా పని చేస్తూ ఇటీవల బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తిరుపతిలో పని చేసిన అనుభవం తనకు చాలా ఉందని, అవినీతికి పాల్పడే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా లంచం అడిగితే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

వెల్ఫేర్ క్యాంటీన్ ప్రారంభం


క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్

తిరుపతి మంగళం: తిరుపతి ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు (ఆర్ఎస్ఏఎస్టీఎఫ్) కార్యాలయం ఆవరణలో ఉద్యోగుల సంక్షేమార్థం వెల్ఫేర్ క్యాంటీన్‌ను శనివారం రెడ్ శాండల్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ క్యాంటీన్ నిర్మాణానికి సహకరించిన సిబ్బంది, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్, రైల్వే కోడూరు, కడప సబ్ డివిజన్ అధికారులు, గూడూరు డీఎస్పీ చెంచుబాబు, ఏసీఎఫ్ శ్రీనివాస్ ఆర్ఐలు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో పీడియాట్రిక్ సర్జరీలపై సెమినార్

తిరుపతి సిటీ: స్విమ్స్ కార్డియోథెరపిక్ అండ్ వాస్క్యులర్ సర్జరీ, పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో పద్మావతి వైద్య కళాశాలలో ఫోకస్డ్ మీట్ ఆఫ్ పీడియాట్రిక్ అండ్ కంజెనిటల్ స్పేస్ హార్ట్ సర్జన్స్ ఇండియా అనే అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్లిష్టమైన ఆపరేషన్లు చేసే సమయంలో తీసుకోవాల్సి జాగ్రత్తలు, విధానంపై రెండు రోజుల పాటు వైద్యులుకు, వైద్య విద్యార్థులకు సెమినార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనం బోల్తా



చంద్రగిరి: ప్రమాదవశాత్తు వాహనం బోల్తా పడడంతో నలుగురు గాయాల పాలైన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి, ముంగళిపట్టు సమీపంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు వివరాల మేరకు.. మహారాష్ట్రకు చెందిన భక్తులు శ్రీవారి దర్శనం ముగించుకుని తుఫాను వాహనంలో చిత్తూరు వైపు పయనమయ్యారు. ముంగళిపట్టు సమీపంలో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని, సర్వీసు రోడ్డుపై బోల్తా పడింది. దీంతో వాహనంలోని నలుగురు భక్తులు గాయాలపాలయ్యారు. పోలీసుటు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక భరోసా

తిరుపతి కల్చరల్: చేతివృత్తుల నేర్చుకోవడం ద్వారా స్వయం ఉపాధి ద్వారా ప్రతి మహిళకు ఆర్థిక భరోసాతో కుటుంబానికి బాసటగా నిలవచ్చని రాస్ మహిళా పొదుపు సంఘాల సంచాలకుడు వి.నాగరాజు తెలిపారు. రాస్–జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో సప్తగిరి నగర్‌లో మహిళలకు ఏర్పాటు చేసిన మూడు నెలల ఉచిత టైలరింగ్ శిక్షణను శనివారం ప్రారంభించారు. వేమన విజ్ఞానకేంద్రం అధ్యక్షుడు నాగార్జున టైలరింగ్ కోర్సుకు సంబంధించి మెటీరియల్స్‌ను మహిళలకు అందజేశారు. రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

26 మందికి ఉద్యోగాలు



తిరుపతి సిటీ: ఎస్వీయూలో శనివారం ఓ ప్రైవేటు కంపెనీ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో సుమారు 26 మందికి ఉద్యోగాలు లభించినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు వీసీ, రిజిస్ట్రార్ నియామకపత్రాలు అందజేశారు. ఎంపికైన అభ్యర్థులు కంపెనీ ప్రతినిధులకు, వర్సిటీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

నేటి నుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలు

తిరుపతి కల్చరల్: ఇస్కాన్ మందిరంలో ఆది, సోమ, మంగళవారం మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతి రమణదాస్ తెలిపారు. శనివారం ఇస్కాన్ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. ఇస్కాన్ కార్యదర్శి లీలా పారాయణదాస్, ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లో సీఐడీ సోదాలు

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో సీఐడీ అధికారులు శనివారం సోదాలు నిర్వహించారు. నగరపాలక సంస్థ నగరంలో రోడ్ల విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లను అందించింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈ బాండ్ల విషయంలో రాజకీయ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఆరోపణ నేపథ్యంలో సీఐడీ అధికారులు మరోమారు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి విచ్చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో సోదాలను నిర్వహించి కొన్ని దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు.

ఇంటిగ్రేటెడ్ పనులను వేగవంతం చేయండి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను త్వరగా పూర్తి చేయాలని తిరుపతి స్మార్ట్‌సిటీ మేనేజింగ్ డైరెక్టర్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. శనివారం ఆమె స్మార్ట్‌సిటీ అధికారులు, ఇంజినీరింగ్, ఏఈకామ్, కాంట్రాక్టు ప్రతినిధులతో నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేస్తున్న ఈఐ ట్రిపుల్ సీ ప్రాజెక్ట్ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో స్మార్ట్‌సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాస్టర్‌మైండ్స్ విజయకేతనం


కె.తేజస్విని, వై.వర్షితారెడ్డి, చందన సీని

తిరుపతి ఎడ్యుకేషన్ : సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో తిరుపతి మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు జాతీయ స్థాయి మొదటి ర్యాంకుతో పాటు 19, 34వ ర్యాంకులు సాధించారు. ఈ మేరకు విద్యాసంస్థల ప్రిన్సిపల్ టి.ప్రసాదరావు శనివారం మీడియాకు తెలిపారు. ఈ ఫలితాల్లో కె.తేజస్విని ఆల్ ఇండియా మొదటి ర్యాంకు, వై.వర్షితారెడ్డి 19, చందన సీని 34వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. అలాగే ఈ పరీక్షకు హాజరైన తమ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను మాస్టర్‌మైండ్స్ ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

- చవితికి అన్ని ఏర్పాట్లు చేయండి
- వినాయక ఉత్సవ కమిటీ, అధికారుల సమీక్షలో కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు జరుపుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్యతో పాటు వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో చవితి వేడుకలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదాన్ని పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. సెప్టెంబర్ 9న వినాయక చవితి సందర్భంగా చేపట్టాల్సిన అలంకరణ ఏర్పాట్లపై ఆయాశాఖల అధికారులు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వినాయక సాగర్, చెన్నాయగుంట, దామినేడు వద్ద నిమజ్జనం సమయంలో ఎలాంటి అపశృతులకు తావులేకుండా చర్యలు చేపట్టాలని వెల్లడించారు. ఆర్టీసీ వారు ట్రాఫిక్ సమస్య రాకుండా రూటు మ్యాప్‌లు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

2500 ప్రతిమలు కొలువుదీరే అవకాశం..

తిరుపతిలో 2500 విగ్రహాలు ఏర్పాటు కానున్నాయని ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ విద్యుత్, పోలీస్, కార్పొరేషన్ అధికారులు ఒకే వేదికగా విగ్రహాల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. పండుగకు మూడు రోజుల ముందే అనుమతులు ఉంటాయని చెప్పారు. మైక్ సిస్టమ్స్ వాడరాదని సూచించారు. నిమజ్జంలో క్రేన్‌లు వాడాలని, వాహనాలు మరమ్మతులకు గురైతే, మెకానిక్‌లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. మద్యం సేవించి గొడవలు చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, నాగభూషణరావు, తుడా సెక్రటరీ వెంకట నారాయణ, శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి, తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.